ముగ్గుల పోటీల్లో శివమ్మకు తృతీయ బహుమతి



పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు శనివారం నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో పిట్టలవానిపాలెం మండలం చందోలు 1వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ కుంచల శివమ్మ తృతీయ బహుమతి సాధించింది. బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణనన్, ఎస్పీ వకుల్ జిందాల్ బహుమతిని ఆమెకు అందజేశారు. ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది శివమ్మను అభినందించారు.

కోడి పందేల స్థావరంపై దాడి..

నగరం: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని బొరమాదిగ పల్లి పంచాయతీ చల్లమ్మ అగ్రహారంలో కోడిపందేల స్థావరంపై శనివారం నగరం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. అందిన సమాచారం మేరకు.. కోడిపందేల స్థావరంపై దాడి చేశామన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని, రెండు కోడి పుంజులు, రూ.2,100ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.





అంబరాన్నంటిన.. సంక్రాంతి సంబరాలు

- కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంగీత విభావరి
- సినీ గీతాలతో హోరెత్తించిన గాయకులు
- భావపురిలో చెరగని ముద్ర : ఎమ్మెల్యే కోన



భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



సంగీత విభావరికి హాజరైన ప్రేక్షకులు

బాపట్ల: ''సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా..'' ''వచ్చాడయ్యో రఘుపతి... తెచ్చాడయ్యో సంక్రాంతి''.. అంటూ సింగర్ సింహా తన గాత్రం వినిపించగా... ''మగువా.. మగువా''.. అంటూ యశస్వీ తన స్వరంతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేశారు. కోన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో ఎమ్మెల్యే కోనరఘుపతి నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సింగర్ సింహా బృందం ఆధ్వర్యంలో జరిగిన సంగీత విభావరి ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. గాయనీ, గాయకులు భావపురి ప్రజల మనసులను రంజింప చేశారు. సింగర్స్ సింహా, యశస్వీ, జయంత్, శ్రీరామచంద్ర, అధితి భావరాజు, హారిక నారాయణన్, కీర్తనశర్మ, మనీషా యర్రబాతిన.. సంగీత విభావరి యువతను ఆకట్టుకుంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జబర్దస్త్ చమ్మక్ చంద్రా, రాకెట్ రాకేష్ బృందాలు నిర్వహించిన కామెడీ షో నవ్వులు పూయించింది. ఉదయం భోగి మంటలు వేసి, సంక్రాంతి వేడుకలను ఎమ్మెల్యే కోన రఘుపతి కుటుంబంతో కలిసి జరుపుకున్నారు.

భావపురిలో చెరగని ముద్ర: ఎమ్మెల్యే కోన

సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని, మాట్లాడారు. తన తండ్రి ప్రభాకర్‌రావు ఆశయాలు నెరవేర్చడం, ఆయన అడుగు జాడల్లో నడిచి, బాపట్ల ప్రజల మనసులో కోన కుటుంబం చెరగని ముద్రగా మిగిలిపోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పండుగ అనేది ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం కాదని, పది మందితో కలిసి అందరిలో ఒకడిగా జరుపుకోవాలనే నినాదాన్ని నాటి నుంచి అమలు చేస్తూనే ఉన్నామన్నారు. అన్ని రంగాలను సంతోషంగా ఉంచేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు.

భట్టిప్రోలు: భోగ భాగ్యాల భోగిని శనివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఐలవరంలో సమరసత సేవా ఫౌండేషన్ నగర సంకీర్తన సంఘం మహిళా కన్వీనర్ దివి సుజాత ఆధ్వర్యంలో భోగి పండుగ వేడుకలు శనివారం జరిగాయి. వేణుగోపాలస్వామి దేవస్థానంలో చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వచనాలు అందించారు. అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి, జంజనం సుధాకర్, జొన్నాదుల వెంకటేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.

వైద్య వృత్తికే వన్నె తెచ్చిన మురళీధరరాజు

పిట్టలవానిపాలెం: వైద్యవృత్తికే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి డాక్టర్ పెనుమెత్స మురళీధరరాజు అని బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంత వర్మరాజు పేర్కొన్నారు. కర్లపాలెం మండలం బుద్దాం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా డాక్టర్ పెనుమెత్స మురళీధరరాజు దంపతులను క్షత్రియ సేవా సంఘం సభ్యులు శాలువా కప్పి, నూతన వస్త్రాలను బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే ఎడ్యుకేషన్ చైర్మన్ వేగేశన రాధాకృష్ణంరాజు, సర్పంచ్ మంతెన గంగరాజు, పిట్టలవానిపాలెం పీఏసీఎస్ చైర్ పర్సన్ గోకరాజు మూర్తిరాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి రూ.25వేలు సాయం

అమర్తలూరు(వేమూరు): మండలంలో తురిమెళ్ల గ్రామానికి చెందిన పేద విద్యార్థిని మహాలక్ష్మికి మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా అమర్తలూరుకు చెందిన పచ్చ ధనుంజయ ప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి కస్తూరి రూ.25 వేలను విద్యార్థినికి అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతనేని భాను ప్రసాద్, అళ్ల అంకమరావు, నార్ల వెంకటేశ్వరరావు, నన్నపనేని అనిల్‌కుమార్, చేకూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతి వేడుకలు

కర్లపాలెం: రామకృష్ణ సేవా సమితిలో శనివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సేవా సమితి అధ్యక్షుడు టీవీ సుబ్బారావు వివేకానందుని బోధనల గురించి భక్తులకు వివరించారు. మంతెన సత్యనారాయణ రాజు, చందు, పిచ్చయ్య, మహిళలుఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

రేపల్లె రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మోపిదేవి రాజీవ్ యువసేన సహకారంతో శనివారం పట్టణంలోని 24వ వార్డు నేతాజీ నగర్‌లోని ఎన్టీఆర్ స్కూల్ ఆవరణంలో మహిళలకు ముగ్గులు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ విజయసారథి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కౌన్సిలర్ కోటేశ్వరరావు, సీపీఎం పట్టణ అధ్యక్షుడు మణిలాల్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సూర్యప్రకాష్, డీవైఎఫ్ఐ నాయకులు, ఐద్వా సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎంపీ సంక్రాంతి శుభాకాంక్షలు



రేపల్లె: రేపల్లె నియోజకవర్గ ప్రజలకు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు సంక్రాంతి శుభాకాంక్షలు శనివారం తెలిపారు. కష్టాలను కాల్చివేసే భోగి మంటలు.. భోగాలను అందించే భోగి పళ్లు.. కొత్త అల్లుళ్లకి స్వాగతం పలికే తోరణాలు.. ఇంటికి చేరే ధాన్యం రాసులతో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

'కార్పెంటర్స్' క్యాలెండర్ ఆవిష్కరణ

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ కార్పెంటర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కర్ శనివారం ఆవిష్కరించారు. వేమూరు నియోజకవర్గ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు వి.సురేష్ కుమార్, అసోసియేషన్ నిర్వాహకులు చెరుకూరి శ్రీనివాసరావు, వెల్లటూరు దివాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జనార్దనస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో భోగి సందర్భంగా శనివారం గోదా సమేత రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు. వేణుగోపాలస్వామి దేవస్థానంలో గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవంగా జరిగింది. యాజ్ఞికులు వినుకొండ మురళీకృష్ణ, అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాస్ మహోత్సవం నిర్వహించారు. ఈటదీవి వెంకట అప్పలాచార్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. శ్రీ దండిపార్వతి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

నగరం: మండలంలోని ధూళిపూడి కోదండరామస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తడవర్తి లావణ్య రామకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీమాన్ నేలబోట్ల ఫణి వల్లభచార్యులు, వేదపండితులు కల్యాణాన్ని శాస్త్రయుక్తంగా జరిపారు.

జంపని(వేమూరు): జంపని గ్రామంలోని చెన్న కేశవ స్వామి దేవస్థానంలో గోదా కృష్ణుల కల్యాణ మహోత్సవం అత్యంత వైభంగా నిర్వహించారు. లక్ష్మి నరసింహచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం జరిగిందని అర్చకులు మేడూరు శ్రీనివాస మూర్తి చెప్పారు. పెరుమూళ్ల భిక్షరావు, గాదంశెట్టి పరిశుద్ధరావు ఊపాల్గొన్నారు.

కర్లపాలెం: భూ నీలా సమేత జనార్దనస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం గోదాదేవి కల్యాణం కనుల పండువగా జరిగింది. అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యులు, వేదాంతం శ్రీనివాసాచార్యులు విశేష పూజలు చేశారు. ధనుర్మాసం ఉత్సవాలు పూర్తయినట్లు ఆలయ పూజారులు తెలిపారు.

రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రహదారిలో రాజ్యలక్ష్మి, గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమలను పంపిణీ చేశారు.













